ఎమ్మెల్యే రాజయ్యను సన్మానిస్తున్న రమేశ్‌యాదవ్

ఎమ్మెల్యే రాజయ్యను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపల్లి అక్టోబర్ 25: రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం హనుమకొండలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్యకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ముదిరాజ్ మహాసభ మండల కన్వీనర్‌గా యాకరాజ్

యాకరాజ్

చిల్పూరు, అక్టోబర్ 25 : ముదిరాజ్ మహాసభ మండల కన్వీనర్‌గా మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన కొత్తపల్లి యాకరాజ్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ముదిరాజ్ మహాసభల జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, మత్స్య సొసైటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ నీల రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యాకరాజ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫలితాలను విడుదల చేస్తున్న కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్

కేయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : ఆగస్టులో నిర్వహించిన కాకతీయ విశ్వవిద్యాలయ దూరవిద్య డిగ్రీ మొదటి, రెండు, మూడో సంవత్సరం బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ పరీక్ష ఫలితాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టీ శ్రీనివాస రావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ప్రొఫెసర్ మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ ఏ నరేందర్ పాల్గొన్నారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడొచ్చని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లా రెడ్డి తెలిపారు.

దీప్తికి కేయూ వీసీ రమేశ్ అభినందన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 25 : ఈ నెల 22 నుంచి 28 తేదీల్లో రిపబ్లిక్ ఆఫ్ చైనాలోని హాంగౌజ్ నగరంలో నిర్వహిస్తున్న ఆసియా పారా క్రీడల్లో వరంగల్ జిల్లా తొర్రూరు మండలంలోని అనుబంధ కళాశాల సమతా డిగ్రీ, పీజీ కాలేజీ పూర్వవిద్యార్థిని జీవంజి దీప్తి మహిళల 400 మీటర్ల పరుగుపందెను 56.69 సెకండ్లలో పూర్తి చేసి, ఆసియా పారాగేమ్స్‌తో పాటు ఆసియా రికార్డును సృష్టించి టీ 20 క్యాటగిరిలో బంగారు పతకం పొందగా, కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆమెకు అభినందనలు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి కాకతీయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల పూర్వవిద్యార్థిని, 2023 సంవత్సరంలో తన బీఏ మూడో సంవత్సరం పూర్తి చేసిందని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ టీ సవితా జ్యోత్స్న వెల్లడించారు.

ఇంటర్నేషనల్ కురాష్ కోచ్‌గా నాగరాజు, నవ్యశ్రీ

కాశీబుగ్గ, అక్టోబర్ 25: కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన చందనగిరి నాగరాజు, నవ్యశ్రీకి ఇంటర్నేషనల్ కురాష్‌లో స్టార్-1 రిఫరీ అండ్ కోచ్ డిప్లామా కైవసం చేసుకున్నారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ సహరాన్‌పూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఇంటర్నేషనల్ కురాష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిఫరీ సెమినార్, కోచెస్ కోర్స్ అండ్ ఎగ్జామినేషన్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి నాగరాజు, నవ్యశ్రీ పాల్గొన్ని అత్యంత ప్రతిభ కనబర్చి డిప్లామా సర్టిఫికెట్లు అందుకున్నారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి మహిళగా నవ్యశ్రీ ఈ డిప్లామా సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకే విజయానికి దోహదం
- బీఆర్ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి. జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘనపురం, అక్టోబర్ 25 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం ఖాయమని స్టేషన్‌ఘన్‌పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగి పార్టీకి అండగా ఉన్నారని తెలిపారు. మండలంలోని పటేలుగూడేనికి చెందిన బీజేపీ నాయకుడు వెంకట్ తన 58 మంది అనుయాయులతో కలిసి జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుకొండలోని కడియం నివాసంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కడియం శ్రీహరి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. దీంతో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఆయన సూచించారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వం కావాలని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని శ్రీహరి అన్నారు. ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించి వారిని చైతన్యపరిచి, బీఆర్ఎస్‌కే ఓటు వేసేలా కార్యకర్తలు శ్రమించాలన్నారు. వార్‌వన్‌సైడే అయినప్పటికీ, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి భారీ మెజార్టీ తీసుకురావడానికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవేంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ తీగల సిద్ధూగౌడ్, నాయకులు బోయిని రాజు, శేఖర్‌రెడ్డి, సోమి రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ సుధీర్, పొన్నాల నరేశ్, కొత్త కొండ గంగాధర్ పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

- ఎన్నికల అధికారుల విధులకు అడ్డుపడిన వైనం
- మల్లికుదుర్లలో కాంగ్రెస్ అభ్యర్థి ఇందిర ఎన్నికల ప్రచారంలో రభస

మల్లికుదుర్లలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు, అక్టోబర్ 25 : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న నేతలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల, గుండ్లసాగర్ గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ అనే నినాదంతో ప్రచారం నిర్వహిస్తూ మహిళలకు పసుపు, కుంకుమ, గాజులతో పాటు జాకెట్(రవిక) ముక్కను కవర్‌లో పెట్టి పంపిణీ చేశారు. కాగా, ప్రచారాన్ని గమనిస్తున్న ఎన్నికల అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది పంపిణీని అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో బహుమతులు లాంటివి పంపిణీ చేయొద్దని ప్యాకెట్లను సీజ్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల అధికారుల వాహనానికి అడ్డుగా నిలిచి వారి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో మల్లికుదుర్లలో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాగా, ఘటనా స్థలానికి వేలేరు ఎస్సై డీ హరిత చేరుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులను, అడ్డుతొలగించి సీజ్ చేసిన పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ప్యాకెట్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్, అక్టోబర్ 25 : పన్ను వసూళ్లలో వేగం పెంచాలని, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో సర్కిళ్ల వారీగా టీఎస్ బీపాస్ పెండింగ్ ఫైళ్లు, పన్నుల వసూళ్ల పురగోతిపై పన్నుల విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 92.21 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కేవలం రూ. 34.21 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారన్నారు. మిగిలిన పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. ఆస్తి పన్నుతో పాటు తాగునీటి పన్నులను వసూళ్లు చేయాలన్నారు. ఆర్ఐల వారీగా పన్నుల వసూళ్ల టార్గెట్లను విధించారు. పక్షం రోజులో పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను సాధించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే క్షేత్రస్థాయిలో పన్నుల వసూళ్లను చేపట్టాలన్నారు. ప్రతి రోజూ పన్నుల వసూళ్లను ఆర్‌వో, ఆర్ఐలు పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో మ్యూటేషన్ అయిన నూతన గృహాలను గుర్తించి వాటికి ఆస్తి పన్ను మదింపు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. బల్దియా అదాయం పెంచేలా కొత్త గృహాలకు ఆస్తి పన్నులు మదింపు చేయాలన్నారు. సీటీజన్ చార్ట్‌ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజల వినతులు, ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఆదనపు కమిషనర్ అనీసుర్ రషీద్, సీపీ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, రవీందర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఆర్‌వో, ఆర్ఐలు పాల్గొన్నారు.

హనుమకొండలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

వైభవంగా పద్మాక్షిదేవి శాంతి కల్యాణం

హనుమకొండ, అక్టోబర్ 25 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో పరిసమాప్తమయ్యాయని ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, దేవాలయ వేద పండితుడు షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం ఉదయం 11 గంటలకు పద్మాక్షిదేవి శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సా యంత్రం 6 గంటలకు తెప్పోత్సవం (పద్మాక్షి తటాకం నం దు) జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఉత్సవాలు పాల్గొన్న భక్తులకు ఆలయ వేద పండితుడు షణ్ముక పద్మనాభ అవధాని మహాదాశీర్వచనం చేశారు. ఏటా నవరాత్రి ఉత్సవాల్లో ఇలాగే భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని అర్చకుడు శంకర్‌శర్మ తెలిపారు.

దుర్గమాత దీక్ష విరమణ..

న్యూశాయంపేట: గ్రేటర్ 31వ డివిజన్ న్యూశాయంపేటలోని రాజరాజేశ్వర ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల ముగింపును పురస్కరించుకొని అమ్మవారి మాలధారణ దీక్ష విరమణ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు పానుగంటి నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భక్తులు దీక్షలు చేపట్టారు. తొమ్మిది రోజులుగా చేపట్టిన దీక్షలు వైభోపేతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.